అమృత్‌కిరణ్ అమెరికా తెలుగు సంఘం సంయుక్తంగా నిర్వహించిన కథలపోటీలలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# దహన 'సంస్కారం'

-పి. చంద్రశేఖర్ అజాద్

సీతారామయ్యకి ఆడపిల్ల పుట్టినప్పుడు ఇలా జరుగుతుందని మాత్రం అనుకోలేదు.

ఆరోజు నాకు బాగా గుర్తుంది. హాస్పిటల్‌నుండి ముఖం వేలాడేసుకొచ్చాడు

"ఏం జరిగిందయ్యా కాన్పు సరిగ్గా జరిగిందా?" అడిగాను భయంగా.



తలూపాడు.

తర్వాత మెల్లగా అసలు విషయం చెప్పాడు.

ఇందులో అంత బాధపడిపోవలసిన అవసరం ఏముంది. తొలిసారి ఆడపిల్ల పుట్టిందంటే లక్ష్మీదేవి మీ ఇంట్లో అడుగుపెట్టినట్లే" అన్నాను.

సీతారామయ్య మాత్రం నవ్వే ప్రయత్నం కూడా చెయ్యలేదు.

"నీకేం నువ్వలానే చెబుతా"వన్నాడు.

అదే ప్రారంభం సీతారామయ్య సుఖపడింది నేను చూడలేదు. చాలా నియమబద్ధమైన జీవితాన్ని గడపటం ఆరంభించాడు. ఇంట్లోనూ అమలు చేశాడు.

కేవలం మూడు సిగరెట్లు మాత్రం తాగేవాడు. వక్కపొడి పొట్లాం కొంటే అది వారం దాకా రావాలి. ఇంకా కూరల విషయంలోనూ అంతే. సంవత్సరానికి సరిపోయే ఆవకాయ పచ్చడి పట్టించేవాడు. అలాగే పండు మిరపకాయల పచ్చడి తొక్కించేవాడు. వాటితోనే భోజనం. దాదాపు ప్రతిరోజూ ఆకుకూరే వండుకుంటారు.

కాయగూరల విషయంలో పట్టింపులేదు. ఏది అతిచౌకగా దొరుకుతుందో అదే వండుకుంటారు. రేడియోలో వార్తలు మాత్రమే వింటారు. మాంసం, చేపలు లాంటివి దాదాపు నిషిద్ధం.

ఒకటి రెండుసార్లు జ్వరపడినప్పుడు బలవంతాన ఓ పావుకిలో తెప్పించాడు. ఇదంతా ఆడపిల్ల పుట్టడంతోనే అనుకున్నప్పుడల్లా నాకు బాధగా ఉండేది.

అంతకుమించి సీతారామయ్య ఇంకో పిల్లని కనటానికి మాత్రంససేమిరా అంగీకరించలేదు. నాతోపాటు చాలామంది స్నేహితులూ, బంధువులూ చెప్పిచూశారు. అయినా ఉపయోగం లేదు.

"నిన్ను పున్నామనరకం నుండి తప్పించటానికి కొడుకు కావాలి కదా. నా తలకి కొరివిపెట్టటానికైనా మగపిల్లాడు కావాలి. ఇంకొకర్ని కని చూడు" అని దగ్గర వాళ్ళు చెప్పారు.

"ఆ నరకం సంగతి నాకు తెలియదు. ఈ అమ్మాయిని పెంచి పెద్దచేసి పంపించగలిగితే చాలు. అయినా చచ్చిపోయాక ఏం జరుగుతుందో నేను చూడొచ్చానా" అన్నాడు.

సరిగ్గా అలానే జరిగింది.

సీతారామయ్య చచ్చిపోయి ఇప్పటికి పది గంటలైంది. జరుగుతున్నదంతా అతను చూడలేకపోవటం వాస్తవమే గాని, నిజంగానే చూడగలిగితే తనెలా ప్రవర్తిసాడు!!

శవం దగ్గర ఓ ముసలావిడ కూర్చునుంది. ఆమె చేతలో తాటాకు విసనకర్ర ఉంది. దాన్తో ఈగలు

ముసరకుండా విసురుతోంది. అయినా ఆమె దృష్టి మాత్రం దూరంగా ఉన్న గుంపుమీదే ఉంది.

ఆ ప్రాంతమంతా గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. కొందరు బంధువులయితే మిగతావారు చుట్టుపక్కలవారు పరిస్థితి చాలా సీరియస్‌గా మారేట్టు కనిపిస్తోంది.

అయితే విషయాన్ని వారంతటవారు తెల్సుకుంటారా లక మేం కల్పించుకోవాలా అనేది ఇంకా నిర్ణయించుకోలేకపోతున్నాం.

మామూలుగా ఇలాంటి సందర్భాల్లో శవం పక్కన భార్య, పిల్లలు భరించలేని దు:ఖంతో కూలబడిపోతుంటారు.

ఇంకో పక్కనుండి చివర యాత్రకి ఏర్పాట్లు జరుగుతుంటాయి.

శవాన్ని తరలించేదాకా పొయ్యి వెలిగించకూడదు. కాబట్టి ముసలివారు తొందరపెడుతుంటారు.

అదేమిటో మనిషికి మృత్యువుతోనే ఆకలీ, స్నానం గుర్తుకొస్తాయే అనిపిస్తుంటుంది. ఎప్పుడెప్పుడు శవాన్ని దహనం చేసి, రెండు చెంబులు నెత్తిమీద గుమ్మరించుకొని, రెండు మెతుకులు కతుకుదామా అన్పిస్తుంటుంది.

అలాంటిది సీతారామయ్య శవం అనాధశవంలా పడుంది. అందుకు ఏడవాలో, జరుగుతున్నదానికేడవాలో అతని భార్యకూ, పిల్లకూ అర్థం కావటంలేదు.

నేను అతన్తో చాలాసార్లు పోట్లాడాను.

"కనీసం ఇంకొకరు అవసరం. రేపు ఆ ఆడపిల్లకి కష్టం వచ్చినా, సుఖం వచ్చినా తోడుగా ఉంటారు" అని చాలా చెప్పిచూశాను.

సీతారామయ్య ఫిలాసఫరో, మూర్ఖుడో తెలియదుగానీ నా వాదనని తిరస్కరించాడు.

"ఈ ప్రపంచంలో తోడు అనేది భ్రమ. ఇంకొకరుంటే తన్నుకుంటారేమో. కాదని మనంచెప్పలేం కదా. అయినా తోడబుట్టినవారే తోడు ఉండాలా? నాకు నువ్వుతోడు కాదా? నీకూ నాకూ ఏం బంధుత్వముంది చెప్పు. అయినా ఈ ప్రపంచం గురించి నీకు తెలియటం లేదు. ఇద్దరు ఆడపిల్లలుంటే వాళ్ళకి పెళ్ళిచేసి, పురుళ్ళుపోసి పంపటానికి ఎన్నిలక్షలు కావాలో మమ్మల్ని చివరిరోజుల్లో చూడరని భయమా?ఎవడికెలా రాసుంటే అలా జరుగుతుంది." అన్నాడు.

సీతారామయ్య ధోరణివలన బంధువుల్తో సంబంధాలు తెగిపోయాయి. ఎవరూ వారింటికి రాగానేను చూడలేదు.

వాళ్ళమ్మాయి పెళ్ళికి మాత్రం కొందరు బంధువులొచ్చారు. ఆడపిల్లలంటే లక్ష్మీదేవి ఈ మాటెవరన్నారోగాని, ఆ అమ్మాయితోనే సీతారామయ్యలోని ఇంకోమనిషి నిద్రలేచాడు.

తనకయితే బాగా డబ్బు సంపాదించాల నుండేది. అందుకు అతనికున్న అవకాశాలు తక్కువ.

రెండెకరాల పొలం ఉంది. చాలా పొదుపుగా జీవించటం వలనా, హోమియోవైద్యం గురించి తనకి కొంత తెలియటం వలన మొత్తంమీద ఓ ఇల్లు చౌకగా కొన్నాడు. అదికూడా వందగజాల్లో కట్టారు. దానికోసం కొంత అప్పుతెచ్చాడు. అది తీరేసరికి కూతురు పెళ్ళి చేశాడు. ఆ అప్పు తీరాక ఆ ఇంటిపైన ఇంకో నాలుగు గదులు కట్టాలనుకున్నాడు. వాటి అద్దెతో సంసారం గడిచిపోతుందనుకున్నాడు.

మొత్తానికి పైన తననుకున్న విధంగా కట్టగలిగాడేగాని బయటివారికి అందుకోసం సీతారామయ్య పడ్డ శ్రమ గురించి తెలీదు. తనే తట్టలు మోశాడు. వాటరింగ్ చేశాడు. రంగులు పూశాడు. తనకు చేతనయిన ప్రతిపనీ చేశాడు.

జీవితంలో మొదటిసారిగా గృహప్రవేశం సందర్భంగా ఆ చుట్టప్రక్కల వారందరికీ తృప్తిగా భోజనాలు పెట్టించాడు.

"సీతారామయ్యగారి అల్లుడు అదృష్టవంతుడు" అంటారు సీతారామయ్యని తెలిసినవారు.

"ఇప్పటికైనా తృప్తిగా తిను. సరదాగా డబ్బులు ఖర్చుపెట్టుకోండి." అని మొత్తుకున్నాను.

"నీకేం అలానే చెబుతావ్. ఇద్దరూ మొగపిల్లలుకదా. ఈ ఇంటికోసం చేసిన బాకీ తీర్చగలిగితే ఈ బతుక్కిచాలు' ' అన్నాడు.

నిజంగానే గాలి భోంచేసి, అన్ని రకాల చాపల్యాలను అణుచుకొని ఆ ఇంటికోసం చేసిన బాకీలు తీర్చాడు.

మృత్యువు ఎప్పుడు విరుచుకుపడుతుందో ఎవరు చెప్పగలరు.

ఇప్పటివరకూ కనీసం చీది ఎరగడు. అలాంటి మనిషి రాత్రి పదిగంటల ప్రాంతంలో గుండెదగ్గర నొప్పిగా ఉందన్నాడట.

"హాస్పిటల్‌కి వెళ్దామా" అంటే...

"తగ్గుతుందేమో చూద్దాం!" అన్నాడు.

మరో అయిదు నిముషాలకి అంతా అయిపోయింది.

సీతారామయ్యకి ఏభైనాలుగు సంవత్స రాలుంటాయేమో. అతని చరిత్ర అలా ముగిసింది.

ఎలా తెలిసిందో ఉదయానికల్లా దాయాదులంతా దిగిపోయారు. అప్పటికే కూతురూ, అల్లుడూవచ్చారు. తమ బంధువుల్ని చూడగానే వారికి దు:ఖం పొంగింది. ఇన్ని సంవత్సరాలుగా ఎలాంటి సంబంధంలేకపోయినా, చివరి నిమిషంలో వచ్చారనే తృప్తి చెందుతుండగా గొడవ మొదలైంది.

"ఇంతకీ తలకొరివి ఎవరు పెడ్తారు" అన్నారెవరో


"ఎవరో పెట్టేదేముంది. కొడుకయినా, అల్లుడైనా ఆ అబ్బాయేకదా. అల్లుడే పెడతాడు" అన్నారు.

"అతనెవరు కొరివి పెట్టడానికి" అన్నారు వచ్చినవాళ్ళు.

"మా వంశం ఇంకా నాశనం కాలేదు. మా అన్నయ్యకి బయటివాడు కొరివి పెట్టడం ఏమిటి? అయిన వాళ్ళందరం చచ్చామా? ఇంతకాలం మా అవసరం లేకపోయినా ఇప్పుడు చచ్చినట్లు మేమేదిక్కు" అన్నారు.

అక్కడినుండి మొదలైంది.

దాదాపు ఇరవైమంది. అందరూ భయంకరంగా కనిపిస్తున్నారు.




ఎ. సరోజ, 12-70-411/8, సికింద్రాబాద్ - 61

వారితోపాటు ఆడవాళ్ళు ఇంతకూ వారి మాటల సారాంశం సీతారామయ్యకి తలకొరివి పెట్టి నందుకు అయిదువేల రూపాయలివ్వాలి. లేకపోతే శవాన్ని దహనం చేయటానికి వీల్లేదు.

నాకు చాలా విచిత్రంగా అనిపించింది.

నేను గతంలోకొన్ని మరణాల్ని చూశాను. ఆస్తుల తగాదాలున్నా అవన్నీ శవదహనం తర్వాత మొద లయ్యాయిగాని ఇలా ఓ పక్క శవాన్నుంచి ఈ తగాదా ఏమిటో అర్థం కాలేదు.

"అయిదువేలకి చస్తారా. ఇంతపెద్ద ఇల్లు కట్టించాడు. కడుపు కట్టుకుని దాచి ఉంటాడు. ఇదంతా బయటినుండి వచ్చినవాడు అనుభవించాలా. అదేం కుదరదు. అయిదువేలు ఇచ్చి తీరాల్సిందే" అన్నారు దాయాదులు.

మొత్తానికి మధ్యవర్తులు బయలుదేరారు. ఏదో ఒకటిచేసి సమస్య పరిష్కారం చెయ్యమన్నారు.

శవం అంతసేపు అలా పడుంటం మంచిది కాదన్నారు.

అయితే అంతడబ్బు ఎక్కడనుండి తేవాలి? అసలు ఎందుకివ్వాలి? ఇటు పక్కనుండి ప్రశ్నలవి.

ఎట్టకేలకు రెండు వేలకి అంగీకరించారు. మధ్య వర్తులు వెళ్ళి దాయాదుల్తో విషయం చెప్పారు.

"అయిదువేలకి నయాపైసాతగ్గం. అందరికీ తలా కొంచెం రావాలికదా" అన్నారు.

అప్పుడు కలిగింది అసహ్యం మా అందరికీ.

సీతారామయ్యకి ఈ విషయం తెలిస్తే బతికొచ్చి అందరిమీదా తిరుగుబాటు చేసేవాడు.

నేను పక్కనున్నవారితో సంప్రదించాను.

"ఇప్పటి వరకూ వారి కుటుంబ సమస్య అనుకున్నాం. ఇదంతా చూస్తుంటే ఇప్పట్లో తెగేట్లు లేదు. ఇంక మనం కల్పించుకోవటం మంచిది"

మేం ఆ ప్రయత్నంలో ఉండగా దాయాదులంతా సీతారామయ్య భార్య దగ్గరి కొచ్చారు. సీతారామయ్య కూతురు చేతులెత్తి నమస్కరించింది.

"మా నాన్నకి మేం ఎలాగో దహన సంస్కారం చేస్తాం. మీరింక కల్పించు కోకండి. రెండువేలు తీసుకుంటే సరి. లేకపోతే మాట్లాడకండి" అంది.

అంతే. వారంతా పూనకం వచ్చినట్లుగా మారి పోయారు. పరమ అసహ్యకరమైన బూతులు. అందులో ఆడవాళ్ళూ ఉన్నారు.

"ఇంత సంపాయించాడు. కట్టుకుపోయాడా. రేపు మీరూ అంతే. మీ ముఖాలు చూసేదిక్కుండదు. ఈ రోజు నుండి మీ కొంపకి ఎవరూరారు. మీరే ఆ డబ్బంతా ఏదానకొట్టుకోండి. అసలు మిమ్మల్నటానికేముంది. ఆ దరిద్రుడికి ప్రేమలుంటేగా? ఎందుకావెధవజన్మ పుట్టాడు. పోయాడు. ఈడిజన్మ తగలడా. పదండెహె పోదాం" అన్నాడెవరో.

అంతే! అందరూ శవాన్ని చూసి ఊశారు.

శాపనార్థాలు పెట్టారు.

నానా బూతులూ తిట్టారు.

ఎలా వచ్చారో అలానే మాయం అయ్యారు.

సీతారామయ్య మాత్రం నిద్రపోతున్నాడు.

తిరిగి ఏడుపులు తారాస్థాయి నందుకున్నాయి.

వెళ్ళిన వారికి తమ వంశం, కుటుంబం, మర్యాద, ఏమీ పట్టలేదు.

కనీసపు మానవత్వాన్నయినా వారు ప్రదర్శించ లేకపోయారు.

నాకు ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే -

ఆ మొగవాళ్ళకి ఏమాత్రం తక్కువ తినలేదు. వారి ఆడవాళ్ళు!

తిరిగి సమస్య మామూలే. ఇంతకీ సీతారామయ్య తలకి కొరివి పెట్టేదెవరు?

అప్పుడు మందుకొచ్చిందా అమ్మాయి.

"మా నాన్నకి ఎవరో కొరివిపెట్టడం ఏమిటి? నేను పెడతాను. కొడుకయినా, కూతురయినా నేనే" అంది.

కొందరు ఏవో అనుమానాలు వెలిబుచ్చబోయారు. అయితే చుట్టుపక్కల వారు మాత్రం వాటిని తోసిపుచ్చారు.

"ఏమిటండీ సంప్రదాయం. అదే కావలిస్తే వారు అలా ప్రవర్తించరు. ఆ అమ్మాయి అన్నదే నిజం. వెంటనే ఏర్పాట్లు చెయ్యండి" అన్నారు.

క్షణాల్లో ఏర్పాట్లు జరిగాయి.

కుండ తీసుకుని సీతారామయ్యకూతురు ముందు నడిచింది.

సీతారామయ్యకి ఇష్టంలేకపోయినా శవంమీద డబ్బులు విసిరారు. అతనివెంట చాలామంది నడిచారు. మెల్లగా అదో ఊరేగింపులా సాగింది. శ్మశానంలో ఆ అమ్మాయి తన నాన్న తలకి కొరివి పెట్టింది. చూస్తుండగానే సీతారామయ్య బూడిదగా మారిపోయాడు.

అందరం వెనక్కి తిరిగాం.

ఇంతకు ముందు దాయాదుల ఆవేశం. ఆక్రోశం ఎంతగా బాధించాయో. ఇప్పుడంత సంతోషం.


ఓ సరికొత్త పవనమేదో తాకినట్లనిపించింది.

'దహన సంస్కారం' అందెనరోగానీ. అదో వివాదం. ఆ వివాదం చుట్టూ పేర్చుకుంటూ పోయిన వన్నీ కూలుతున్నట్లనిపించింది.

సీతారామయ్య ఇప్పుడు లేడు.

అతని జీవితం నేర్పుతున్న పాఠాలు మాత్రం ఎప్పుడూ ఉంటాయి.


పి. చంద్రశేఖర్ అజాద్
ఎపిఎస్‌టిసి లిమిటెడ్,
25-1-1, పైతాబాద్,
ఏలూరు - 534 002


శ్రీమతి ఎన్. హరిప్రియ, శ్రీరామారైస్ మిల్లు, స్టువార్ట్‌పురం, బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా - 522317